

# పాపులర్ రచనలు చేయుటం ఎలా?

యండమూరి వీరేంద్రనాథ్

(క్రిందటి సంచిక నుంచి తరువాయి)

*5. ద్వంద ప్రవృత్తి*

రచయితలు అందరూ దాదాపు ద్వంద్వప్రవృత్తి కలిగి ఉంటారు. బయట స్నేహితులతో మాట్లాడుతున్నా, పుస్తకాలు చదువుతున్నా, సినిమా చూస్తున్నా అతనిలో నిరంతరం ఒక వ్యక్తి ఆ అనుభవంలోంచి తనక్కావలసిన విషయాల్ని తీసుకుని అవి రచయితగా తనకెంతవరకూ ఉపయోగపడతాయి అన్న విషయం గురించి ఆలోచిస్తుంటాడు. అలా ఉంటేనే రచయితగా అతడు షైన్ అవుతాడు. ఈ నిరంతర ఆలోచన అనేది రచయితకి ఒక రకంగా శాపం. ఏ అనుభవాన్ని ఆస్వాదించబోయినా, దాన్ని ఆహ్లాదకరంగా ఆస్వాదించటం కన్నా, ఒక రచయితగా విశ్లేషించుకోవటమే ఎక్కువగా ఉంటుంది. అందరూ ఆనందంగా ఉన్నప్పుడూ తను కూడా వారిలో మిళితమై ఉంటూ కూడా దాన్ని ఒక రచయితగా పరిశీలిస్తూ ఉండాలి. అంతేకాకుండా తన మిత్రులు, దగ్గరివాళ్ళు, బంధువులు వారి వారి భావాల్ని చెబుతున్నప్పుడు, వాదిస్తున్నప్పుడు, వాటి వెనక ఆ పాత్రల మనస్తత్వమో, ఆ వాదనవల్ల వారికి వచ్చే ఉపయోగమో, తన తరఫునుంచే కాకుండా దానికి వ్యతిరేక దిశలో నుంచి కూడా ఆలోచించవలసి ఉంటుంది. నాణేనికి బొమ్మా - బొరుసూ ఉన్నట్టే ప్రతి వాదనకి రెండు కోణాలుంటాయి. ఆ రెంటినీ పై ఎత్తునుంచి చూసి తన రచనలో వాటిని ఉపయోగించగలిగితేనే అతడు మంచి రచయిత అవుతాడు.

రచయిత, వ్యక్తి రెండుగా విడిపోకపోతే అతడు కేవలం ఒక కోణంలోంచే చూడగలుగుతాడు. అంతేకాకుండా జీవితంలో ఎన్ని అనుభవాలు వచ్చినా వాటిని ఆస్వాదించడానికే సరిపోతుంది తప్ప, రచనలో ఉపయోగించుకోటానికి వీలుండదు. అలా అని నలుగురి కంపెనీలో ఉన్నా, నలుగురూ నవ్వుతూ ఉన్నా, సీరియస్‌గా ఉండి గడ్డం పెంచి, సిగరెట్ వెలిగించి పదిమందికీ తనొక రచయితనని, చెప్పుకుంటూ. ఇతని కంపెనీ ఎందుకొచ్చిందిరా భగవంతుడా, అని నలుగురూ ఫీలయ్యేలా ఉండకూడదు. వాళ్ళతో ఆనందంగానే ఉండాలి. కానీ ఇంతకు ముందు చెప్పినట్టు లోపలున్న రచయిత మాత్రం నిరంతరం యాక్టివ్‌గానే ఉండాలి.

*6. తాను వ్రాసింది రంభ*

లోగడ మేము నిర్వహించిన వర్క్‌షాప్‌కి వచ్చే వర్ధమాన రచయితలు తమ వ్రాతప్రతులు మాకిచ్చినప్పుడు వాటిని చదివి, ఇది బాగోలేదు, లేక ఇందులో ఫలానా విషయంలో కృషి చేయాలి - అని చెప్పగానే వారు చాలా నిరాశా, నిస్పృహలకి లోనవటం మేం గమనించాం. అంతేకాదు, ఆ రచన పట్ల రచయితలు అప్పటికే ఒక గొప్ప నమ్మకాన్ని ఏర్పరుచుకుని ఉండటం కూడా గమనించాం.. తను వ్రాసింది తనకి అద్భుతంగా ఉండటంలో ఆశ్చర్యమేదీ లేదు. కానీ ఆ రచన మరొకరు చదివినప్పుడు వారిని కొంతయినా సంతృప్తి పరచకపోతే అది పాపులర్ అవటం చాలా కష్టం. రచయిత తప్పనిసరిగా ఈ భ్రాంతి నుంచి బయటపడాలి.

వ్రాసిన ప్రతిదీ పత్రికకి పంపించటం గానీ, మరొక పెద్ద రచయితకు చూపించటం గానీ చేసేముందు తన స్నేహితులకి ఇచ్చి, దానిమీద వారి అభిప్రాయం చెప్పమని అడగటం ఉత్తమమైన పద్ధతి. అయితే ఇందులో ఒక చిక్కుంది. స్నేహాన్ని వదులుకోలేకనో, లేక

మొహమాటం వల్లనో, అసలు చదవకనో, కొన్ని సందర్భాల్లో వ్రాతప్రతిని తిరిగి ఇచ్చేస్తూ "చాలా బావుంది. అద్భుతం." అనవచ్చు. తొంభైశాతం కేసుల్లో ఈ విధంగానే జరుగుతుంది. నా దగ్గరికి వ్రాతప్రతి తీసుకొచ్చిన వారు "ఇది మా స్నేహితులందరూ చదివారు. చాలా బావుందన్నారు." అని ప్రారంభిస్తారు.

అలా కాకుండా స్నేహితుల్ని రకరకాల ప్రశ్నలు వేయటం ద్వారా వారియొక్క నిర్ధిష్టమైన అభిప్రాయాలు పొందవచ్చు.

మా వర్క్‌షాప్‌లో కూడా ఒక వర్ధమాన రచయిత వ్రాసిన వ్రాత ప్రతిని మరొక రచయితకో, రచయిత్రికో చూపించినప్పుడు వారు కూడా 'బావుంది.' 'బానేవుంది' అనేవారు. కానీ లోతుగా గుచ్చి అడిగితే, ప్రచురింపచడే యోగ్యత లేని కథలుగానే వాటిని తేల్చేసేవారు.

ఇప్పటికి కూడా పెద్ద రచయితలు తమ వ్రాతప్రతిని సాటి రచయితలతో చదివించడంగానీ, మరికొంతమంది అభిప్రాయాలు సేకరించటంగానీ, చివరికి ఎడిటర్స్, పబ్లిషర్స్‌తో చర్చించిన తరువాతే ప్రచురణకి సీరియల్స్‌గా ఇస్తూ ఉంటారు.

ఇందులో మొహమాటపడవలసిన విషయంగానీ మనమీద మనకు నమ్మకం లేకగానీ కాదు. మనం వ్రాసింది పదిమంది ముందుకి వెళ్ళే ముందు, పదిమంది చదివి అభిప్రాయాలు చెబితే, అదెప్పుడూ మనకి ఉపయోగపడే విషయమే అవుతుంది.

*7 <u>పరిధి</u>*

రచయిత్రుల నవలల కన్నా రచయితల నవలలో ఎక్కువ ప్రపంచం కనబడుతుంది అన్న విషయంలో ఏ విధమైన సందేహోమూ లేదు. కొద్ది మంది రచయిత్రులు తప్ప మిగతా వారందరూ కుటుంబాలు కథాంశంగా చేసుకునో, లేక హీరో హీరోయిన్ల మధ్య రొమాన్సునో వ్రాస్తూ వచ్చారు. దీనికి కారణం ఏమిటంటే బయటి ప్రపంచం గురించి రచయితలకి తెలిసినంతగా, రచయిత్రులకి తెలియకపోవటమే. రచయిత (త్రి) తప్పని సరిగా బయటి ప్రపంచాన్ని చూడాలి. ఈ విషయం ఇంతకుముందే చర్చించటం జరిగింది. ఇక్కడ చెప్పదలచుకున్న పాయింట్ ఏమిటంటే, రచయిత తన కంపెనీనీ, స్నేహబృందాన్నీ, తన చుట్టూ ఉన్న పరిస్థితుల్నీ తరచు మారుస్తూ ఉండాలి. ఎప్పుడూ ఒకే గ్రూపుతోగానీ, కొద్దిమంది స్నేహితుల్తోగానీ, ఒకే వాతావరణంలోగానీ ఉంటూ ఉంటే అతని రచన కూడా ఆ పరిధికే పరిమితమై పోతూవుంటుంది. కొత్త కొత్త వ్యక్తులతో పరిచయాలూ, కొత్త వాతావరణం, రచయిత యొక్క పరిధిని పెంచి విన్నూత్నకోణాల్లో రచన సాగించటానికి దోహదపడుతూ ఉంటుంది.

*<u>8. ప్యాడ్ పెన్సిల్</u>*

తమ దగ్గర ఎప్పుడూ ఒక చిన్న ప్యాడ్‌నీ, కలాన్నీ ఉంచుకోవటం తప్పనిసరి. బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడో, రైల్లో వెళుతున్నప్పుడో లేక స్నేహితుల్తో సంభాషిస్తున్నప్పుడో చప్పున ఒక పాయింట్ స్ఫురిస్తుంది. వెంటనే దాన్ని నోట్ చేసుకుని, ఇంటికి వెళ్ళాక మరికొంత విస్తృతంగా దాని గురించి వ్రాసుకుని ఒక ప్రక్కన ఫైల్లో పెట్టుకోవాలి. ఇలా చేయకపోతే కేవలం వ్రాయటం కోసం కూర్చున్నప్పుడు వచ్చే భావాలు మాత్రమే ఆ రచనలో ప్రతిబింబిస్తాయి తప్ప, దినసరి కార్యక్రమంలో మనసులో కలిగిన భావాలు రచనలోకి ప్రతిబింబించవు.

ఇందులోనే మరొక విషయం ఏమిటంటే, ఒకే కథాంశం తట్టినప్పుడు అది రచనగా రూపుదిద్దుకోడానికి కొంతకాలం పడుతుంది. నిరంతరం అదే కథాంశాన్ని గురించి మనం ఆలోచిస్తుంటాం కాబట్టి ఎప్పుడెప్పుడు తట్టిన భావాల్ని, అప్పుడప్పుడే మనం స్టోర్ చేసుకోవాలి. మనం వ్రాయబోయే కథాంశానికి సంబంధించిన వ్యక్తుల్ని కలుసుకున్నప్పుడు వారిచ్చే ఇన్‌ఫర్‌మేషన్ అంతా ప్యాడ్‌లో నోట్ చేసుకుంటూ ఉండాలి. రచయిత మరీ పాపులర్ అయిన తరువాత, ఒకేసారి మూడు నాలుగు కథాంశాల్ని మనసులో అనుకుంటూ ఉంటాడు. అవన్నీ రచనగా రూపుదిద్దుకోడానికి అతనికి సంవత్సరం లేదా రెండు సంవత్సరాలు పట్టొచ్చు. అతడు విభిన్న వ్యక్తుల్ని

కలుసుకున్నప్పుడుగానీ, తనలో రూపొందిన ఆలోచన్లని నోట్ చేసుకోవలసి వచ్చినప్పుడుగానీ ఈ ప్యాడ్, పెన్ల అవసరం చాలా ఉంటుంది.

ఇలా పాయింట్స్ వ్రాసుకున్నప్పుడు ఇంటికి వెళ్ళిన తరువాత వాటిని విభిన్న కథాంశాల కోసం తయారుచేసిన నోట్స్‌లో వ్రాసుకోవాలి. ఆ సీరియల్ వ్రాయబోయే ముందు, మొత్తం సంవత్సరంపాటు తయారుచేసిన ఇన్ఫర్మేషన్ అందులో ఉంటుంది. ఆ విధంగా రచయిత పని సులువవుతుంది.

*9. ఎన్నిక.*

రచయిత తను చదవదలచుకున పుస్తకాలని ఎన్నిక చేసుకోబోయే ముందు చాలా లిబరల్‌గా ఉండాలి. కేవలం నేనీ రకం పుస్తకాలే చదువుతాను. ఫలానావి చదవను - అని గిరిగీసుకో కూడదు. అదే విధంగా ఫలానా విషయం మాత్రమే వ్రాస్తాను - అని పాపులర్ రచయిత అనుకోకూడదు. కొందరికి అల్లసాని పెద్దన్న నచ్చితే మరికొందరికి మధుబాబు నచ్చుతాడు. వీలయినంతవరకూ అందరు పాఠకుల్ని సంతృప్తిపరచగలిగే రచయితే, పాపులర్ రచయితవుతాడు.

క్రొత్త అనుభవాలూ, క్రొత్త పుస్తకాలూ, క్రొత్త పరిచయాలూ... ఏదైనా సరే "క్రొత్త" కనబడితే దాన్ని రచయిత వదిలిపెట్టకూడదు. అందులో ఏముందో అని శోధించే గుణం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ఈ విధంగా ప్రతిదాన్ని శోధించటం ద్వారా, ఏదో ఒక పాయింట్ రచయితకి దొరక్క తప్పదు.

క్రొత్తగా కనపడిన ప్రతీది తెలుసుకోవాలి అనే గుణం లేని రచయితలెవరూ పాపులర్ కాలేరు. అదేవిధంగా క్రొత్త పుస్తకం కనపడగానే దాన్ని చదవాలి - అన్న ఆసక్తి లేని వ్యక్తి కూడా.

*10. సొంత అభిప్రాయాలు*

ప్రతి వ్యక్తికి కొన్ని సొంత అభిప్రాయాలుంటాయి. అయితే పాపులర్ రచయితని, మిగతా రచయితలతో విడగొట్టే పాయింట్ ఇదే! ఏ పాపులర్ రచయిత కూడా కేవలం తన సొంత అభిప్రాయాల్ని మాత్రమే వెలిబుచ్చి ఊరుకోడు. ఇంతకుముందే చెప్పినట్టు నాణానికి బొమ్మా, బొరుసును కూడా పరిశీలిస్తాడు. ఒక్కోసారి ప్రేమ కన్నా ఉదాత్తమైందేదీ లేదంటాడు. మరోసారి ప్రేమంతా ట్రాష్ అంటాడు. పరస్పర విరుద్ధమైన భావాలు, విరుద్ధమైన పాత్రల ద్వారా చెప్పించటంగానీ లేదా విభిన్నమైన నవలలు వ్రాయటం ద్వారాగానీ, రచయిత వీలయినంత ఎక్కువ మంది పాఠకులని ఆకట్టుకుంటాడు.

ఏ పాఠకుడికైనా తనకున్న అభిప్రాయమే రచనలో కనబడితే, ఆ రచయితకి మానసికంగా దగ్గరవుతాడు.

పాపులర్ రచయిత ఎవరైనా సరే ఒక స్థిరమైన అభిప్రాయాలన్ని వెలిబుచ్చడు. అలా అని మరీ సొంత అభిప్రాయాలు లేకుండా ఉండమని కాదు. తన సొంత అభిప్రాయాలేమిటో, ప్రతి విషయం పట్ల తన ఆలోచనేమిటో రచయిత ఎంత కాదనుకున్నా బయటపడుతూనే ఉంటుంది. పాఠకులు అమాయకులు కాదు. వారు రచయిత అభిప్రాయాల్ని గమనిస్తూనే ఉంటారు.

పాపులర్ రచయిత తన అభిప్రాయాలతో ఏకీభించని పాఠకుల్ని కూడా ఆకట్టుకోవటం తప్పనిసరి.

అందువల్ల తను నమ్మని సిద్ధాంతాన్ని కూడా ఒకోసారి ప్రతిపాదించవలసి వస్తుంది. పాత్రల ద్వారా చెప్పించవలసి వస్తుంది. అటువంటప్పుడు రెండు పాత్రల మధ్య వాదోపవాదాలుగా చిత్రించటం మంచిది. అయితే, ఇలాటి వాదోపవాదాల్లో 'తను నమ్మడు కదా' అని, ఆ సిద్ధాంతాన్ని ఎగతాళీ చేయకూడదు. అలా చేస్తే కొందరు పాఠకుల్ని కోల్పోక తప్పదు.

కానీ ఎంతోకాలం ఇలా జరగదు.

ఎంతపాపులర్ రచయితకయినా, కొంత కాలానికి ఈ ద్వంద్వప్రవృత్తి బోరు కొడుతుంది. తను నమ్మిన సిద్ధాంతాల్నే చెప్పాలనుకుంటాడు. కలల ప్రపంచాన్నీ, ఫాంటసీలని వదిలేస్తాడు. యదార్ధ మానవ సంబంధాల్నీ సామాజిక స్థితిగతుల్నీ తన రచనల్లో చొప్పించాలనుకుంటాడు.

దీనికోసం తన అమ్మకాల్ని కూడా తగ్గించుకోవటానికి సిద్ధపడతాడు. ఇలా పరిణామం చెందని రచయిత లందరూ తాము వ్రాయటం మానేయడాన్నే - 'ఫేడ్ అవుట్' అయిపోయారు.

లేదా -

వ్రాసిందే వ్రాస్తూ - ఆ అజ్ఞానంలోనే బ్రతుకుతున్నారు.

వచ్చే సంచికలో.. రచయిత... మూడ్